ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8 : కనిష్ఠం 19.6

నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఎలక్షన్‌గా పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం చేసి ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా సమాధానం చెప్పాలని తెలిపారు.

'స్థానిక' పోరుకు పార్టీల సన్నద్ధం



పార్టీ శ్రేణులతో సమావేశమైన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

- అధికార కాంగ్రెస్ పార్టీలో మొదలైన సందడి
- జిల్లాలోని నేతలు, కార్యకర్తలతో వరుస సమావేశాలు
- బూత్‌స్థాయి నుంచి ప్రచారం వైపు బీజేపీ
- పూర్వ వైభవం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నాలు
- షెడ్యూల్ వైపు నేతల చూపు

నిర్మల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక ఎన్నికల కోసం మూడు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. వారం రోజుల్లోగా గ్రామ పంచాయతీలు, మరికొద్ది రోజుల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నట్లు అన్ని వైపుల నుంచి సంకేతాలు వెలువడుతున్న కారణంగా అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెట్టే పనిలో నిమగ్నమవుతున్నాయి. ఇందులో భాగంగానే అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోబోతోంది. పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కారణంగా ఈ ఎన్నికలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించి మినీ రెఫరాండంగా మారే అవకాశాలున్నట్లు తమ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీని కోసం గానూ జిల్లా ఇన్‌చార్జీ మంత్రితో పాటు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు, పార్టీ మండల బాధ్యులు స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోబోతున్నారు. నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించబోతోంది. ఇప్పటికే శ్రీహరిరావు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు పార్టీ సీనియర్ నేతలతో పలు దఫాలుగా సమావేశమై ఎన్నికల వ్యూహరచన కోసం కసరత్తు మొదలు పెట్టారు. గ్రామీణ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరినీ స్థానిక ఎన్నికల వైపు కార్యోన్ముఖులను చేసేందుకోసం విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసే యోచనలో ఆ పార్టీ నేతలున్నారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సైతం స్థానిక ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా మొదలుపెట్టాయి. ముఖ్యంగా బీజేపీ జిల్లాలోని రెండు అసెంబ్లీ స్థానాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా స్థానిక ఎన్నికలను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డితో పాటు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లను సాధించి తమ సత్తాను చాటుకునేందుకు సిద్దమవుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం చెందినప్పటికీ ఈ ఎన్నికల ద్వారా తిరిగి తన ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీ సీనియర్ నాయకులు లేకున్నప్పటికీ ఉన్న కేడర్‌తో పాటు ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకునేందుకు సిద్ధమవుతోంది.

ఆధిపత్యం కోసం అధికార కాంగ్రెస్ పార్టీ

అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని స్థానిక ఎన్నికల ద్వారా చాటుకునేందుకు ముందస్తు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై గ్రామస్థాయి నుంచి విస్తృత ప్రచారం చేపట్టడమే కాకుండా ఇంటింటికి పథకాల అమలుకు సంబంధించి సమాచారాన్ని చేరవేయాలని నిర్ణయించింది. ఇటీవలే బీసీ జనాభా లెక్కలతో పాటు ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఈ రెండు అంశాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేసిన అంశాన్ని కూడా ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. దీనికి అనుగుణంగా బీసీ సంఘాలతో విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా బీసీ జనాభా లెక్కలు వెల్లడించడం అలాగే ఎస్సీ వర్గీకరణపై స్పష్టతనిచ్చిన అంశాలపై ఇక ఊరూరా ప్రచారం చేపట్టబోతోంది. ఎస్సీ వర్గీకరణ వ్యవహారంపై దళిత సంఘాలతో కూడా సమావేశాలు నిర్వహించే దిశగా కసరత్తు మొదలుపెట్టబోతోంది. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకొని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఇక పూర్తిస్థాయిలో చెక్ పెట్టాలని ఆ పార్టీ నేతలు యోచిస్తున్నారు.

మొదటిసారి ఉత్సాహంగా బీజేపీ

కాగా బీజేపీ స్థానిక ఎన్నికల్లో మొదటిసారి పూర్తిస్థాయిలో సత్తాను చాటుకునేందుకు సిద్ధమవుతోంది. లోక్‌సభ సీటును భారీ మెజారిటీతో గెలుచుకున్న బీజేపీ జిల్లాలోని ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల బలాన్ని అండగా పెట్టుకొని స్థానిక ఎన్నికల్లో విజయ ధుంధుభి మోగించాలని భావిస్తోంది. ముథోల్, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని స్థానిక సంస్థలన్నింటిని కైవసం చేసుకొని అధికార కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్‌లు స్థానిక ఎన్నికల సమరానికి సంబంధించిన వ్యూహ ప్రతివ్యూహాలను రచిస్తున్నారు. బీజేపీ సీనియర్ నేతలైన దేవేందర్‌రెడ్డి, యెండెల లక్ష్మీనారాయణ, ప్రేమేంధర్‌రెడ్డిలతో పాటు తదితర రాష్ట్ర స్థాయి నాయకులు జిల్లాలో ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేసి స్థానిక ఎన్నికల వైపు కేడర్‌ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే బీజేపీ ఈసారి వ్యూహాత్మకంగా పోలింగ్ బూత్ కమిటీలను క్రియాశీలకం చేసే పనిలో నిమగ్నమైంది. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అలాగే రుణమాఫీ, రైతు భరోసా వైఫల్యాలను ఎజెండాగా చేసుకొని విస్తృతస్థాయిలో ప్రచార కార్యక్రమాలను చేపట్టేందుకు ఆ పార్టీ రంగంలోకి దిగబోతోంది.

సందిగ్ధంలో బీఆర్ఎస్

ఇదిలా ఉండగా మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిన బీఆర్ఎస్ పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధించేందుకు కసరత్తు జరుపుతోంది. ముఖ్యంగా జిల్లాలో ఆ పార్టీకి ఆశించిన స్థాయిలో నాయకులు గానీ కేడ ర్ గానీ లేకపోవడం చర్చకు తావిస్తోంది. ఒక్క ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ నేతల జాన్సన్‌నాయక్ కొంత మేరకు పార్టీ పరమైన కార్యకలాపాలు కొనసాగిస్తున్నప్పటికి నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో మాత్రం ఆ పార్టీ తిరిగి పుంజుకోవడానికి యేటికి ఎదురీదాల్సిందేనంటున్నా రు. అయితే అంతో కొంత తమకు బలమున్న చోట మాత్రం ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నాలు చేసేందుకు సిద్ధమవుతోంది. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలను ఎజెండాగా చేసుకొని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ఓటర్లకు వివరించి తిరిగి రాజకీయంగా నిలదొక్కుకోవాలని ఆ పార్టీ యోచిస్తోంది. మొత్తానికి మూడు ప్రధాన పార్టీలు రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ సత్తాను చాటుకునేందుకు చేస్తున్న ముందస్తు ప్రయత్నాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



విద్యార్థులకు మెనూ ప్రకారం

భోజనం అందించాలి

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు



వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి డీటీపీవో అంబాజీకి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెంబి మండలంలోని కోసగుట్ట గ్రామంలో రాష్ట్రంలో రాష్ట్ర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం అందించడం లేదని గ్రామస్థులు కోరడంతో పాఠశాలను సందర్శించగా పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టడం లేదని తేలడంతో మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వాసవి, తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు సాధన

రైతుల విజయం

- చైర్మన్ పల్లె గంగారెడ్డి



పసుపు బోర్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న జిల్లా బీజేపీ నేతలు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పసుపు బోర్డు సాధన రైతుల విజయం అని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ నేతలతో కలిసి గురువారం రోజు పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని సన్మానించినట్లు జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి తెలిపారు.

మోటార్ సైకిల్‌ను

ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

- ప్రమాద స్థలంలోనే ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన భీమేశ్వర్.. పరిశీలిస్తున్న ఎస్సై సందీప్

మామడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమ్మదుర్తి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పి సుర్జాపూర్ గ్రామానికి చెందిన పన్నెల భీమేశ్వర్(56) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ నుండి ఖానాపూర్ వైపు వెళ్తున్న (ఏపీ 01 ఏహెచ్ 2315) నెంబర్ గల మోటార్ సైకిల్‌ను మరో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అదుపు తప్పి కింద పడింది. ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన పన్నెల భీమేశ్వర్ తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు మామడ ఎస్సై సందీప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల సమక్షంలో మృతుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేరాలకు పాల్పడుతున్న

ముగ్గురికి 14 రోజుల రిమాండ్

కడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోత) : వరుస అటవీ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నేరస్థులను పాండ్వాపూర్ అటవీ బీట్‌లో ఏర్పాటు చేసినటువంటి కెమెరా సహకారంతో ఈ ముగ్గురు నిందితులను పట్టుకున్నామని ఎఫ్ఆర్‌వో గీతారాణి తెలిపారు. నిందితులను ఖానాపూర్ కోర్టులో హాజరుపరిచి 14 రోజుల రిమాండ్ పంపినట్టు తెలిపారు.

పలువురికి పరామర్శ



లోకేశ్వరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజూర మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను, అలాగే పుష్పూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయరెడ్డికి హైదరాబాద్‌లో ఆపరేషన్ అయి ఇటీవల ఇంటికి వచ్చిన తర్వాత విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సభ్యులు లోలం శ్యాంసుందర్ వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భోజన్న, బీఆర్ఎస్ యువ నాయకులు అనిల్, సుధాకర్ ఉన్నారు.

కడ్తాల్ వై జంక్షన్ సమస్యను పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కడ్తాల్ జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి సమస్యలను పరిష్కరించేందుకై సంబంధిత అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీవో అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించిందన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, శాశ్వత పరిష్కారం పూర్తయ్యే లోపు తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. కడ్తాల్ గ్రామం నుంచి నిర్మల్ వైపుకు వాహనాలు మళ్లే దారిలో తాత్కాలిక రహదారి విభాగాలను ఏర్పాటు చేసి, భారీ వాహనాలు మళ్లుతాయో లేదో తెలుసుకునేందుకు పరిశీలనాత్మకంగా అధికారులు, గ్రామస్థుల సమక్షంలో ఆర్టీసీ బస్సులను తిప్పి చూడాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామస్థుల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్థుల నుంచి సమస్య పరిష్కారానికి సూచనలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేందర్‌రెడ్డిలు ఆర్డీవో రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్‌కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్డీవో దుర్గాప్రసాద్, సోన్ మండల తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి, మంత్రులను కలిసిన భైంసా ఏఎంసీ చైర్మన్



ఉపముఖ్యమంత్రికి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం



మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్‌తో మాట్లాడుతున్న ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజక వర్గ ప్రగతితో పాటు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని భైంసా ఏఎంసీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావ్, పొన్నం ప్రభాకర్‌లకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులను కలిసి ఇక్కడి ప్రగతి పనులు, సమస్యల పరిష్కారంపై వినతి పత్రాలను అందించారు. ప్రధానంగా భైంసా వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. ఈ సందర్భంగా భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులను ఘనంగా సన్మానించి బాసర అమ్మవారి చిత్ర పటాలను బహూకరించారు.

విద్యార్థులు ప్రత్యేక పరీక్షలకు హాజరు కావాలి

- విద్యార్థులు అభ్యాసంపై ఎక్కువగా దృష్టి పెట్టాలి : డీఈవో రామారావు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాధికారి పి. రామారావు

సోన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి పి. రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతకు విద్యార్థుల హాజరు మూలమని, గైర్హాజరైన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అవసరమైన విషయాల్లో సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని ఆయన సూచించారు. అదే విధంగా పదవ తరగతి విద్యార్థులకు విషయాల సిలబస్ పూర్తిచేసి, అభ్యాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. తదుపరి ఎక్కువగా స్లిప్ పరీక్షలు వ్రాయాలని తెలిపారు. జిల్లాలో గురువారం నుండి ప్రత్యేక అభ్యాస పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పరుస్తూ, విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తూ, విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునే విధంగా వారికి సూచనలు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని చార్ట్ రూపంలో ప్రదర్శనగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సమన్వయకర్త నర్సయ్య, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డ్ సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌనారి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ఏఎస్పీ

కుభీర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌనారి గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేకువ జామున గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ధృవీకరణ పత్రాలు లేని 50బైకులు, 1 ఆటో, పట్టుకున్నామన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ క్రైమ్, 1930 ఇంపార్టెంట్ గురించి కల్తీ మద్యం , గంజాయి, డయల్ 100పై అవగాహన కల్పించారు. ఈయన వెంట భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై పి. రవీందర్, కుంటాల ఎస్సై భాస్కరచారి, భైంసారూరల్ ఎస్సై మాలిక్, సిబ్బంది ఉన్నారు.

పరీక్షా కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ ఓం ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ల్యాబ్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు స్వామి ఉన్నారు.

అదుపు తప్పి శిలాఫలకాన్ని

ఢీకొట్టిన ప్రైవేట్ పాఠశాల బస్సు

సారంగాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల బీరవెల్లిలో గురువారం ప్రైవేట్ పాఠశాల బస్సు సాయంత్రం విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో అదుపు తప్పి శిలాఫలకాన్ని ఢీకొట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. బస్సులో ఉన్నటువంటి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని దీంతో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధించిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకొని విచారణ చేపట్టారు.



మంత్రి సీతక్క సమక్షంలో పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకులు

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

నేరడిగొండ, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని కోర్టికల్, లింగట్ల, ఆరెపల్లి నారాయణపూర్ తదితర గ్రామాల నుంచి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లి మంత్రి సీతక్కతో పాటు దండే విఠల్, వేణుగోపాలచారిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి సీతక్క పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. దేశంలో పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో తీత్రే నారాయణసింగ్, రాథోడ్ కమల్ సింగ్, బోథ్ మార్కెట్ కమిటీ ౘైర్మన్ బొడ్డుగంగారెడ్డి. వైస్‌ౘైర్మన్ ఆడే వసంత్‌రావు తదితర నాయకులు ఉన్నారు.

'మాదిగలకు 11శాతం రిజర్వేషన్ అందించాలి'

తలమడుగు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు చట్టబద్ధమైనదేనని చెప్పిందని, రాష్ట్రంలో దాదాపు 32లక్షల వరకు ఉన్న మాదిగలకు 9శాతం రిజర్వేషనున్ కల్పిస్తూ ఆమోదించడంపై మండలంలోని మాదిగలు, ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాగతిస్తూ సంబరాలను చేసుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రేమేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని, తమ పోరాటానికి కరిగిన రాష్ట్రం కేవలం 9శాతం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. జనాభా ప్రతిపదికన తమకు 11శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో మాదిగ సంక్షేమ సంఘం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నిత్యాడి నగేష్, పెగ్గెర్ల అరవింద్, ఎల్పుల శివ గోంటి ముక్కులా అరవింద్, తోట ఆడేళ్ల సతీష్, ప్రశాంత్, వంశీ, అశోక్, గంగన్న, తదితరులు ఉన్నారు.

ధనుర్‌లో క్రీడా సామగ్రి పంపిణీ

బోథ్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనుర్ గ్రామ మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి గురువారం అంబేద్కర్ యువజన సంఘానికి రూ.20వేల విలువైన క్రీడా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కారం రవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

భీంపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని ధన్నోరా గ్రామానికి చెందిన మట్ల శ్రీనివాస్ యాదవ్‌కు చెందిన ఎద్దు గురువారం సాయంత్రం గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ఇదే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంగానే ఎద్దు మృతిచెందిందని కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



తహసీల్దార్ కార్యాలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

బోథ్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన మండలంలో అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం సాయంత్రం సోనాల మండల కేంద్రంలోని తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్యామల దేవితో కలిసి నూతన కార్యాలయం ప్రధాన ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన మండలం ఏర్పాటు చేయడంతోపాటు కార్యాలయాలను ప్రారంభించారన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని అధికారులు అందరితో కలిసి సమన్వయంతో మండల అభివృద్ధి కృషిచేయాలని కోరారు. అంతేగాక నూతన మండలంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషిచేస్తామని అన్నారు. కలెక్టర్‌వెంట సీఈవో జితేందర్‌రెడ్డి, ఆర్డీవో వినోద్, ట్రైనింగ్ కలెక్టర్లు అభిజ్ఞాన్, సబ్‌కలెక్టర్ యువరాజ్‌లతోపాటు బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్ నూతన మండలం తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో రాజేశ్వర్‌లు పాల్గొనగా స్థానిక సీఐ వెంకటేశ్వరరావు ఎస్సై ప్రవీణ్ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. కాగా కలెక్టర్‌కు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సదానందం సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన ప్రజలు నాయకులు ఉన్నారు.

వార్షిక పరీక్షలపై ఒత్తిడికి గురికావొద్దు

ఆదిలాబాద్ రూరల్: సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్‌లో ప్రీ మెట్రిక్ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతుల కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు అవసరమైన సామగ్రిని కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కె.రాజలింగు, షెడ్యూల్ కులాల అభివృద్ధి బి.సునీత కుమారి, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

బోథ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఇన్సూరెన్స్ లేకుండా నంబర్ ప్లేట్ లేని వాహనాలు దారులకు జరిమానాలు విధించారు. నిబంధన ప్రకారం వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు ఉండాలని, లేకుంటే కేసులు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

● ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



అంతర్‌రాష్ట్ర రోడ్డును పరిశీలిస్తున్న డీఎస్పీ

తలమడుగు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని అదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి కోరారు. గురువారం అదిలాబాదు నుండి మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిని డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు, రూరల్ సీఐ ఫణీందర్, తాంసి ఎస్సై రాధిక తలమడుగు ఎస్ఐ అంజమ్మలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరుగుతున్న కోడదు, పోన్నారి, హస్నాపూర్, సుంకిడి, గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, అలాగే కోడదు గ్రామం వద్ద రోడ్డుపక్కన ఉన్న ఇళ్ల ఫెన్సింగ్ ఆక్రమణలు తొలగించాలనీ, అలాగే రోడ్డుకిరువైపులా అనవసరమైన పొదలు, రోడ్డుపక్కన ఉన్న జంతువులను తొలగించడంతోపాటు ప్రమాదకర వంపులు ఉన్నచోట రాష్ట్రరహదారి నిర్మించేలా ప్రతిపాదన సిద్ధంచేయాలని ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ అధికారులు పనులుచేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, గ్రామస్థులు ఉన్నారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమేనా?

(5వ పేజీ తరువాయి)

కనిపించడం లేదు. పాత పైపులైన్‌ను తొలగించి కొత్త పైపులైన్‌ను వేయాలంటే సుమారుగా రెండు మాసాల సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు. బ్రిడ్జి పై నుంచి వెళ్తున్న మిషన్ భగీరథ పైపులైన్‌ను తొలగిస్తేనే పనులను ప్రారంభిస్తామని నేషనల్ హైవే అధికారులు పే ర్కొంటున్నారు. ఇలా 2శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతోనే పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

● కోట్ల నిధులతో తాత్కాలిక వంతెనలు

గత రెండేళ్లుగా తాత్కాలిక వంతెనలను నిర్మిస్తున్న వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. వేసవి, శీతాకాలాల్లో పెద్దగా ఇబ్బ ందులు లేకపోయినా వర్షాకాలంలో మాత్రం భారీ వరదలకు తాత్కాలిక వంతెన పూర్తిగా కోతకు గురై ధ్వంసమైపోతుంది. దీంతో యేటా కోట్ల రూపాయల నిధులు వరద నీటి పాలవుతున్నాయి. మళ్లీ తాత్కాలికంగా లోలెవల్ వంతెనను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే తాత్కాలిక వంతెన పనులను ప్రారంభించారు. వర్షాకాలం లోపు ఈ పనులను పూర్తి చేసి వాహనాల రాకపోకలను ఈవంతెన పై నుంచి మళ్లించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందికరంగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. భారీ వరదలకు తాత్కాలిక వంతెన కొట్టుక పోయే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. శాశ్వత బ్రిడ్జి నిర్మాణంపై నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు తాత్కాలిక వంతెనలతోనే సరిపెడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మద్యం మత్తులో డ్రైవర్ హంగామా

● అడ్డొచ్చిన ప్రతీ వాహనం ఢీ

● డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు



ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ హంగామా సృష్టించాడు. అడ్డొచ్చిన ప్రతీ వాహనాన్ని ఢీకొడుతూ పలువురిని గాయపర్చిన ఘటన ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ చెందిన రాజు కారుడ్రైవర్ గురువారం రాత్రి మద్యంమత్తులో కారును అతివేగంగా కారు నడుపుతూ బస్టాండ్ నుంచి ఇందిరమ్మకాలనీ వైపు వెళ్లాడు. ఈ క్రమంలో అడ్డు వచ్చిన ప్రతీ వాహనాన్ని ఢీకొంటూ వచ్చాడు. స్టేడియం, సెల్ఫీ పాయింట్, శివాలయం సమీపంలో పలువురి వాహనాలను ఢీకొట్టి పలువురికి తీవ్రంగా గాయపర్చాడు. వాహనాలు సైతం నుజ్జునుజ్జయ్యాయి. శ్రీరాంకాలనీ శివాలయం సమీపంలో ఓ కారును ఢీకొట్టగా స్థానికులు ఆపి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో ఓ మహిళ మెడలోని గొలుసునును లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించిన దొంగను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి మాధస్తు మహేందర్ తన తల్లి విజయలక్ష్మితో కలిసివాళ్ల బంధువులను చూడడానికి సాయంత్రం వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండవ అంతస్తు నుంచి దిగుతుండగా ఏమాయికుంటకు చెందిన ముండే శ్రీకాంత్ అనే వ్యక్తి విజయలక్ష్మి మెడలోని గొలుసును లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో పక్కనే ఉన్న మహేందర్ దొంగ దొంగ అని అరవడంతో.. అతను పారిపోయే ప్రయత్నం చేయగా బయట ఉన్న సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. దొంగకు దేహశుద్ధి చేసి టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాంత్‌ను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వే నివేదికను వ్యతిరేకిస్తూ బీసీ సంఘాల నిరసనలు



భైంసా ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడుతున్న బీసీ సంఘాల ప్రతినిధులు

భైంసా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికలను వ్యతిరేకిస్తూ గురువారం భైంసాలో బీసీ సంఘాల నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. సంబంధిత విషయంలో బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి, భైంసా డివిజన్ బీసీ సంఘాల ప్రతినిధులు ఎనుపోతుల మల్లేశ్వర్, రావుల పోశెట్టి, తాలోడ్ శ్రీనివాస్, జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాస్,అరె కటిక సంఘం ప్రతినిధి న్యామత్‌వార్ లింగోజీ, పద్మశాలి సంఘం ప్రతినిధి అనంవార్ ప్రకాష్, మున్నూరు కాపు సంఘం ప్రతినిధి గాలిరాజుల ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అర్‌డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వే లోపభూయిష్టంగా జరిగిందని ఆరోపించారు. పథకం ప్రకారం సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ సామాజిక వర్గ జనాభాను తక్కువగా చూపించారని విమర్శించారు.పారదర్శకతను పక్కన పెట్టి ఇష్టరాజ్యంగా నిర్వహించబడిన సర్వేతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాల వారికి ప్రయోజనం చేకూరేలా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్‌కు బీసీ వర్గాల అభ్యున్నతిపై ఎంత మాత్రం చిత్తశుద్ధి ఉన్న సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకతమైన విధానాల ద్వారా మరో మారు నిర్వహింప చేసి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ వర్గాలన్నీ ఏకమై రాష్ట్ర ప్రభుత్వానికి తగు రీతిలో గుణపాఠం నేర్పుతామని వెల్లడించారు. అంతకు ముందు అర్‌డీవో కార్యాలయం ప్రవేశ మార్గంలో బీసీ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

సారంగాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి (బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ జనరల్ సెక్రటరీ మామిడాల మనోహర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత గంజాయి, సిగరెట్, గుట్కా, కోకాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ మాదక ద్రవ్యాలతో మరణించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు, పాప్కార్న్, చిప్స్ ప్యాకెట్స్, చాక్లెట్స్‌కు దూరంగా ఉండాలని, వీటి వల్ల అనారోగ్య బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని, విద్యార్థులు కష్టతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. మత్తు పానీయాల వల్ల భారీమూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో హన్మగౌడ్, పండరి, లక్ష్మణరావు పటేల్, వి. పెంటాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

కుభీర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ గురువారం కుభీర్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులయిన అధ్యాపకులచే విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, స్కాలర్‌షిప్, వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

● అధికారులకు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం ● విద్యార్థినులతో కలిసి జాంలో సహపంక్తి భోజనం



సారంగాపూర్ మండలం జాం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

సారంగాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని జాం గ్రామంలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు రాత్రి వేళలో ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందు వల్ల నిర్దిష్ట ప్రణాళికను తయారు చేసి.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. విద్యార్థులు కూడా తమకు ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో షుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ ఉద్యోగులు



నిర్మల్ ఆర్టీసీ డిపో గేట్ ముందు నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపో ఉద్యోగులు ఈ నెల 9వ తేదీ తర్వాత రాష్ట్ర జేఏసీ నాయకులు పిలుపు మేరకు ఎప్పుడైనా సరే మేము సమ్మెకు సిద్ధంగా ఉన్నామని గురువారం నిర్మల్ డిపో ఎదురుగా ప్రభుత్వానికి వ్యతి రేకంగా ధర్నా నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆర్టీసీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 2017 పే స్కేల్‌కు సంబంధించి ఏరియర్స్ చెల్లించాలి. ప్రభుత్వంలో విలీన ప్రక్రియ అమలు చేసి 2021, పేస్కేల్ అమలు పరచాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు. యూనియన్‌లను పునరుద్ధరించాలి. రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలి. డీఏ ఏరియర్స్ ఇవ్వాలన్నారు. పనిభారం తగ్గించాలని, ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. యాజమాన్యం వేధింపులు మానుకోవాలన్నారు. ఈ డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మేము సమ్మెకు సిద్ధంగా ఉన్నామని నిర్మల్ డిపో గేట్ ముందర ధర్నాకు దిగారు.

విద్యార్థి దశలో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఖానాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో శ్రమించిన ప్రతి ఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఖానాపూర్ ఎంపీడీవో సునీత అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సోషల్ మేళా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు ఆయా అంశాలతో తయారు చేసిన నమూనాలను పరిశీలించి, వాటి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి తెలుగు అభ్యాస పరీక్షను పరిశీలించిన ఎంపీడీవో విద్యార్థులకు పలు సూచనలను, సలహాలను అందజేశారు. అనంతరం సోషల్ మేళాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్పన ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శం

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్

ఖానాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ అన్నారు. గురువారం ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ అగ్రశ్రేణి నాయకుడు రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసే విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణనను పూర్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక అడుగు ముందుకేసి తమ పార్టీ ఆధ్వర్యంలో రాబోయే అన్ని ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని యావత్ బీసీ సమాజం స్వాగతిస్తోందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు పలు బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ ౘైర్మన్లు రాజూర సత్యం, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ ౘైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు తోట సత్యం, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా, పెంబి అధ్యక్షుడు సల్ల స్వప్నిల్‌రెడ్డి, జిల్లా నాయకులు జంగిల్ శంకర్, మడిగెల గంగాధర్, పరిమి సురేష్, మదిరే సత్యనారాయణ, తులాల శంకర్, బాశెట్టి నర్సయ్య, మాసుల లక్ష్మీరాజం, అడ్వాల శంకర్, గంగారెడ్డి, రాం భీమయ్య, అశోక్, శ్రీనివాస్, రాజేశ్వర్ సహా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంచికంటి లక్ష్మణ్

పెంబి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఈ నెల 9న హనుమకొండ పట్టణంలో ఏఐసీసీ టీయూ రాష్ట్ర ప్రథమ మహాసభ ఉందని, కార్మికులందరూ తరలిరావాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ఉపాధి వేతనాలు పాత పెన్షన్ విధానాల కొరకు కార్మికులు పోరాడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ 2000 నుండి 4000లు పెంచాలని, నెలలో 26 రోజులు బీడీ కార్మికులకు చేతి నండా పని ఇవ్వాలన్నారు. కార్మికుల కనీస వేతనాల జీవోను వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని, ఇళ్లు లేని కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇవ్వాలన్నారు. సంవత్సరాల నుండి పోడు భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, గ్రామ పంచాయతీ కార్మికులకు 26 వేల వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులందరూ ఈ మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికంటి నర్సయ్య, ఆల్ ఇండియా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నూరి రాజేశ్వర్, మహిళా సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి పర్వీన్, కార్మికుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పున్నం కేశవులు, భవన కార్మిక నిర్మల్ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, ఉపాధ్యక్షులు పెద్ద కేశవులు, జిల్లా నాయకుడు అర్జున్, తదితరులు పాల్గొన్నారు.


స్ఫూర్తి

పిప్పల్‌కోటిలో వంటలు చేస్తున్న ముస్లిం సోదరులు (ఫైల్)


గ్రామంలోని వేంకటేశ్వర స్వామి మూల విరాట్


బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వర ఆలయం

ఆదర్శం.. పిప్పల్‌కోటి గ్రామం

● నాడు గొడవలు.. నేడు ఆధ్యాత్మిక బాట
● ప్రతీ పండుగలో కనిపించే ఐక్యత

భీంపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆ గ్రామంలో ఎప్పుడు గొడవలు ఉండేవి. చిన్న చిన్న తగదాలతో పంచాయతీలు, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరగడం ఉండేవి. అయితే క్రమంగా ఆధ్యాత్మిక చింతన పెరగడంతో ఇప్పుడు ఐక్యత, అభివృద్ధి కనిపిస్తున్నాయి. వివరాలు ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామం 10 ఏళ్ల క్రితం అబ్బా అది గొడవల గ్రామం అని పేరుండేది. గ్రామంలో పదేళ్ల క్రితం వేంకటేశ్వర ఆలయం నిర్మాణం తరువాత భక్తి భావం పెరిగింది. గ్రామస్థులంతా రోజు పూజలకు వెళ్లటం నేర్చుకున్నారు. ప్రతీ సంవత్సరం వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు కూడా మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జాతర నిర్వహించనున్నారు.

● ప్రతీ పండుగలో సామరాస్యత

ఈ గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ముస్లీం సహోదరులు పాల్గొంటారు. అలాగే కట్న కానుకలు సమర్పిస్తారు. నవరాత్రుల సందర్భంలో కూడా దుర్గమ్మకు ముస్లీం పెద్దలు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. మహా అన్నదానం, వంటల్లో పాల్గొంటారు. ఇక పొలాల పండుగలో హిందూ ముస్లీం రైతులంతా తమది రైతు కులం అని ఐక్యత చూపిస్తారు. కాగా మొహరం 10 రోజులు కూడా హిందూ సహోదరులు ఐక్యతగా కలిసి వచ్చి ఘనంగా పండుగ జరుపుకుంటారు. ఇలా అధ్యాత్మిక వాతావరణం నెలకొన్న తరు వాత ప్రశాంతత అలుముకుంది. రాష్ట్రంలో ఎక్కడ లేని బరకం చావ్లా భూములు ఉన్న ఈ గ్రామ రైతులు ఇప్పుడు సిరులు పంటలు పండిస్తున్నారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్ ఈ ప్రాంత రైతులకు ఒక వరం.

● ముస్లిం సోదరుల సహకారం గొప్పది



మా గ్రామంలో ప్రతీ పండుగ కలిసిమెలిసి జరుపుకుంటాం. భక్తి మార్గంతో ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. గ్రామాల్లో ప్రశాంతత ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. మా గ్రామంలో వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు, దుర్గ నవరాత్రులప్పుడు మహా అన్నదానం చేస్తాం. ఈ అన్నదానంతో వంటా వార్పు ఆచారం ప్రకారం ముస్లీం సహోదరులే చేస్తారు. అలాగే వారు ప్రతీ పండుగలో మాతో ఉంటారు. మేము కూడా మొహరం పండుగకు వారితో ఉంటాం. పండుగలే కాదు అందరి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ ధైర్యంగా ముందుకు నడుస్తున్నాం.

గడ్డం లస్మన్న, గ్రామ పెద్ద పిప్పల్‌కోటి

● మా గ్రామంలో ఐక్యత ఉంది



మా పిప్పల్‌కోటి గ్రామంలో ఇప్పుడు చిన్న గొడవ అనేది లేదు. భక్తి భావంతో ఉన్నాం. మంచితనంతో ఎవ రి పనులు వారు చేసుకుంటారు. మా గ్రామంలోని పండుగల్లో కనిపించే వైభవం, ఐక్యత చూడటానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ ఎన్ని కల అప్పుడే రాజకీయం అనేది ఉంటుంది. తరువాత అందరం కలిసిపోతారు.

- షేక్ అక్బర్ రైతు, పిప్పల్‌కోటి వాసి


జడ్పీ కార్యాలయంలో డంపింగ్ చేసిన ఎన్నికల సామగ్రి

ఎన్నికల సామగ్రి వచ్చేసింది!

ఆదిలాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. దీంతో అధికారుల్లో హడావుడి మొదలయ్యింది. ముఖ్యంగా ఎన్నికల నియామావళి బుక్‌లెట్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్, సీల్‌కవర్స్‌ను భద్రపరిచేందుకు, పెద్ద సైజు కవర్స్ ఇతర ఎన్నికల సామాగ్రిని జిల్లాకు తరలించారు. దీంతో మండలాల వారీగా ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. ఏ క్షణంలోనైనా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మండలాల వారీగా కావాల్సిన సామగ్రిని కేటాయిస్తూ అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాల ముద్రణకు అధికారులు ఆర్డర్ ఇవ్వడంతో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు బ్యా లెట్ పత్రాల తయారీలో నిమగ్నమయ్యారు.






భక్తులతో కిటకిటలాడిన కూర వేంకటేశ్వర స్వామి ఆలయం


భక్తి

కల్యాణోత్సవంలో తాళిబొట్టును చూపుతున్న అర్చకులు

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం

● భారీ ఎత్తున తరలివచ్చిన మహిళలు, భక్తులు ● భక్తులతో కిటకిటలాడిన కూర వెంకటేశ్వర స్వామి ఆలయం

జైనథ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర గ్రామంలోని వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి, పద్మవతి అలివేలు మంగమ్మలకు వేద మంత్రాలు బాజాభజంత్రీల మధ్య కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగురంగుల పూలతో పాటు వివిధ విద్యుత్ మెర్కురి బల్బులతో ఆలయాన్ని అలంకరించారు. ఈ కల్యాణోత్సవానికి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వేలాది మంది మహిళలు, భక్తులు హాజరై వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కూర గ్రామ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ చిట్యాల సుహాసిని రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాయల శంకర్, కూర గ్రామస్థులు, గ్రామ మహిళలు, భక్తులు అర్చకులు పాల్గొన్నారు.




కల్యాణోత్సవంలో పాల్గొన్న కూర గ్రామస్థులు

మొరం టిప్పర్లను వదిలేయండి

● రెవెన్యూ అధికారులపై జిల్లాలోని బడా బాబుల ఒత్తిడి ● నామమాత్రపు జరిమానాలతో విడుదల
● యథేచ్ఛగా మొరం, ఇసుక అక్రమ దందా ● చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

ఖానాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా సాగిస్తున్న అక్రమ దందాలను అడ్డుకునేందుకు ప్రయత్ని స్తున్న రెవెన్యూ అధికారులపై జిల్లాలోని బడా బాబులు తీవ్రమైన ఒత్తిడి చేస్తు న్నట్లు తెలుస్తోంది. మండలంలోని సింగాపూర్ శివారు ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు మొరం టిప్పర్లను రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ మొరం టిప్పర్లను పట్టుకున్నదే మొదలు జిల్లాలో బడా బాబుల నుంచి తమపై తీవ్రమైన ఒత్తిడి వస్తున్నట్లు తహసీల్దార్ వాపోయారు. ఎవరు ఒత్తిడి చేస్తున్నారో తెలుపాలని అడిగితే ప్రస్తుతం నేను ఎవరి పేరు చెప్పలేనంటూ ఆమె నిస్సహాయత వ్యక్తం చేశారు. ఈ టిప్పర్లకు ఒక్కోదానికి రూ. 2500ల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. అనుమతి లేకుండా మొరం, ఇసుక లాంటి ప్రకృతి వనరులను ఇతర ప్రాంతాలకు తరలించి పట్టుకున్న తర్వాత తమను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కాగా ఖానాపూర్ ప్రాంతంలో మొరం, ఇసుక లాంటి ప్రకృతి వనరులను జోరుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ స్పందించాల్సిన మైనింగ్ అధికారులు మాత్రం పట్టించుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక్క రెవెన్యూ మాత్రమే కాకుండా అటవీ శాఖ, మైనింగ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులంతా పకడ్బందీగా ఈ అక్రమ మొరం, ఇసుక దందాలను అరికట్టేందుకు కృషి చేయాలని ఖానాపూర్ మండల వాసులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఇసుక, మొరం తరలించే మాఫియా గతంలో రెవెన్యూ అధికారులపై దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు గత తహసీల్దార్ మీడియా ముఖంగా తెలిపిన నేపథ్యంలో కచ్చి తంగా ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలంటే పోలీసుల సహకారం కావాలని రెవెన్యూ అధికారులు అభిప్రాయపడు తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించి ఈ ప్రకృతి వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. తమపై తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్న నేపథ్యంలో కేవలం నామ మాత్రపు జరిమానాలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. సామాన్యుడు ఇంటి అవసరాలకు మొరం తెచ్చుకుంటే ఒక ట్రాక్టర్‌కు రూ. 1000 పైగా జరిమానా విధించే అధికారులు టిప్పర్ల ద్వారా బడా బాబులు తరలిస్తున్న ఈ మొరం దందాకు మాత్రం ఒక్కో టిప్పర్‌కు రూ. 2500ల జరిమానాలు విధించడంపై సామాన్యులు ముక్కున వేలేసుకుంటున్నారు.


ఖానాపూర్ రెవెన్యూ అధికారులు పట్టుకున్న మొరం టిప్పర్లు

మల్లన్న పల్లకీకి ఘన స్వాగతం


భైంసాలో మల్లన్న పల్లకీ ఊరేగింపు

భైంసా,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని గ్రామ గ్రామాన మల్లన్న స్వామి భక్తులు ఎడ్‌బిడ్ మల్లన్న స్వామి పల్లకికి ఘనస్వాగతం పలుకుతున్నారు. గురువారం వివిధ ప్రాంతాల మీదుగా భైంసాకు చేరుకున్న మల్లన్న స్వామి పల్లకికి పట్టణ సరిహద్దు ప్రాంతంలో పలువురు తమ కుటుంబీకులతో వెళ్లి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి నిర్వాహక బృందం పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించింది.

కన్నీళ్లు తెప్పిస్తున్న మిరప ధర

కుభీర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : గత మూడేళ్లుగా ధరలు నిలకడగా ఉన్నాయనే ఆశతో ఈ ఏడాది మండలంలో రైతులు మిరప సాగు విస్తీర్ణం పెంచారు. అధిక పెట్టుబడులయిన ఎంతో శ్రమించి మిరప పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తీరా పంట చేతికందే సమయంలో ధరలు పతనం కావడంతో ఆవేదన చెందుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ యాడాది రైతులు ఎన్నో ఆశలతో సాగు విస్తీర్ణం పెంచారు. మొదట్లో చీడపీడలు లేకున్న పూత కాత దశలో నల్లి ఆశించడంతో నివారణకు పదే పదే పురుగు మందులు పిచికారి చేశారు. పెట్టుబడిని స్థోమతకు మించి పెట్టారు. ఇప్పుడు ఎకరాకు ఇరవై క్వింటాళ్ల దిగుబడి గగనంగా మారిందని రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిరప క్వింటాలు ధర రూ. 12వేలు పలుకుతోంది. గతేడాది సీజన్‌లో తేజ రకం ధర రూ. 28వేలు వరకు పలికింది. ఈ ఏడాది పంట మార్కెట్‌కు తరలివస్తున్న కొద్ది ధరలు పతనం అవుతున్నాయి. వ్యాపారులేమో రూ. 11వేల నుంచి రూ. 13వేల వరకే కొనుగోలు చేస్తున్నారు.


కుభీర్‌లో రైతులు సాగు చేస్తున్న మిరప పంట

● పెట్టుబడి భారంగా మారింది

కందూర్ సాయినాథ్, యువ రైతు కుభీర్



దుక్కిదున్నడం ఎరువులు, పంటలకుపై మందు పిచికారి చేయడం, కలుపుతీర, అరక, కూలీలు తదితర పనులకు కలిపి పెట్టుబడి ఎకరాకు రూ.1,20,000 నుంచి రూ. 1,40,000 వరకు అయ్యింది. పండు మిరప ఏరివేతకు కూలీలకు కిలోకు రూ.10చొప్పున చెల్లిస్తున్నాము. ఎండిన తరువాత చూస్తే ఒక క్వింటాలు మిర్చి సేకరణకు రూ. 2 వేలు ఖర్చు వస్తోంది. పెట్టుబడి పోను మిగిలేది వెట్టిచాకిరేనని మిరప రైతు దిగులు చెందుతున్నారు.

వైభవంగా ప్రారంభమైన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాల్వ శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి దేవస్థానం కోనేరు చెంత శ్రీ ధ్యాన హనుమాన్ విగ్ర హ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురు వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, యాగశాల ప్రవేశం, వాస్తువర్ణ్యగ్రీకరణం పూజలు నిర్వహించారు. కాగా 18 అడుగుల ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్రకు చెందిన భజన బృందం శ్రీరామ సంకీర్తన ఆలాపన చేశారు. అయిండ్ల చంద్రమోహన్‌రెడ్డి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

నేటి నుంచి గుండంపల్లి వేంకటేశ్వర బ్రహ్మోత్సవ వేడుకలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవ వేడుకలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు పూర్కొన్నారు. శుక్రవారం ఉదయం గణపతి విశ్వక్సెన పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, సాయంత్ర భేరి పూజ, దేవతా ఆహ్వానం, ధ్వజారోహణం, సామేహిక కుంకుమార్చన, చతుర్వేద సేవ, తదితర పూజలు శనివారం మూల మంత్ర హవనం, సుదర్శన హోమం, ఎదుర్కోలు, వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం పల్లకి సేవ, అన్న ప్రసాద వితరణ, ఆదివారం స్థాపితా దేవతా పూజలు, పూర్ణా హుతి, చక్ర తీర్థం, నాగవెల్లి, ధ్వజారోహణ సప్తావరణం, ఏకాంత సేవ దీపోత్సవం, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.


గుండంపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయం


ఫొటోస్టోరీ

క్రేన్ సహాయంతో విద్యుత్ స్తంభాలను తరలిస్తున్న సిబ్బంది



కొత్త ఆలోచన.. రేడిక ప్రయాస

విద్యుత్ స్థంభాల తరలింపు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. అవసరమైన చోట్ల స్థంభాలను ఏర్పాటు చేసేందుకు వాటిని తరలించే సమయంలో రహదారులు మరమ్మతులకు గురయ్యేవి. దీంతో పుర, విద్యుత్ సిబ్బంది ఇబ్బంది పడేవారు. తాజాగా స్థంభాలను క్రేన్‌కు బిగించి వెనక రెండు టైర్ల సహాయంతో రోడ్డుపై గీరలు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కొత్త ఆలోచనతో రోడ్లపై సాఫీగా స్థంభాలను తరలిస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


అధికార యంత్రాంగం బిజీబిజీ

స్థానిక సంస్థల ఎన్నికల నగరా ఏ క్షణంలో అయిన మోగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సర్వం సమాయత్తం చేస్తుంది. ఇందుకు గాను జడ్పీ సమావేశ మందిరంలో పోలింగ్‌లో వినియోగించే పత్రాలు, గుర్తుల పరిశీలనలో అధికారులు తలమునకలయ్యారు. అధికార యంత్రాంగం ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

● ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్







• జైనథ్ మండలం సాత్నాల వాగు పై నిర్మించిన తర్నం బ్రిడ్జి



నిధులు మంజూరైనా నిర్లక్ష్యమేనా?

- రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని తర్నం బ్రిడ్జి పనులు
- వర్షాకాలంలోనే హడావుడి చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు
- మిషన్ భగీరథ పైపులైన్ తొలగించేందుకు తీవ్రజాప్యం
- తాత్కాలిక వంతెన కోసం రూ.4.50 కోట్ల నిధులు మంజూరు
- మరో యేడాదైనా పనులు పూర్తికావడం అనుమానమే..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భారీ వరదలకు దెబ్బతిన తర్నం బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసినా అడుగడుగునా నిర్లక్ష్యమే కన్పిస్తోంది. జైనథ్ మండలం సాత్నాల వాగుపై నిర్మించిన తర్నం బ్రిడ్జి పగుళ్లు తేలి ధ్వంసం కావడంతో అటువైపు వెళ్లే భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో హడావుడిగా రూ.40కోట్ల నిధులను మంజూరుచేసి నిరాల టూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రం వరకు ప్రత్యామ్నాయ మార్గం పనులను పూర్తిచేశారు. అయితే ఇరుకు రోడ్డుతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ బ్రిడ్జి మీదుగానే జైనథ్, బేల, మహారాష్ట్ర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగుతాయి. ఎంతో ప్రాధాన్యత గల ఈ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు నిండు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరుచు ప్రమాదాలు జరుగడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ - బేల - మహారాష్ట్రలోని రాజురా వరకు 353 (బీ) జాతీయ రహదారి 33కి.మీల మేర విస్తరణ పనులకు గాను గత ప్రభుత్వహయాంలోనే రూ.490 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందులో రూ.194 కోట్లకు టెండర్‌లను పూర్తిచేసి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగానే రూ.25కోట్ల నిధులతో తర్నం బ్రిడ్జి పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైనా సంబంధిత కాంట్రాక్టర్ బ్రిడ్జినిర్మాణ పనుల జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదు. గతంలో జిల్లా పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఈ పనులను ప్రారంభించారు. దీంతో మహారాష్ట్రలోని ఔరంగబాద్ జిల్లాకు చెందిన ఆర్‌బీ షెూట్కె కంపెనీ పనులను దక్కించుకుంది. గత యేడాది క్రితం బెయిలీ బ్రిడ్జి (ఐరన్)ను నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఏడాదైనా పనులు పూర్తికావడం గగనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

• వర్షాకాలంలోనే ఉరుకులు.. పరుగులు

వర్షాకాలం వచ్చిందంటే అధికారులు, ప్రజాప్రతినిధులు బ్రిడ్జి నిర్మాణంపై ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఆ తర్వాత అసలు విషయాన్నే మరిచిపోతున్నారు. దీంతో అనుకున్న సమయంలో బ్రిడ్జి నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. తాత్కాలిక రోడ్డుపై ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో అటువైపు వెళ్లిన అంబులెన్స్ వాహనం అదుపు తప్పి వరద నీటిలో బోల్తాపడింది. అలాగే పలు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ప్రస్తుతం ఉన్న తర్నం బ్రిడ్జిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు సర్వే పనులను కూడా పూర్తి చేశారు. అయిన ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం కోసం పునాదులను వేయకపోవడంతో ఇంకెన్నాళ్ల పాటు పనులకొనసాగుతాయో అర్థంకావడం లేదంటున్నారు. వర్షాకాలంలో సాత్నాల వాగుకు భారీ వరదలు రావడంతో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. గతంలో అన్ని రాజకీయ పార్టీలు బ్రిడ్జి నిర్మాణంపై హడావుడి చేశాయి. ప్రస్తుతం ఓ కాంట్రాక్టర్ పనులను దక్కించుకోవడంతో సైలెంట్టై పోవడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పైపులైన్‌ను తొలగిస్తేనే పనులు చేపడుతాం..

• డి. సుభాష్ (నేషనల్ హైవే డీఈ)

తర్నం బ్రిడ్జి పై వేసిన పైపులైన్‌ను తొలగిస్తేనే పనులను ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే సర్వే పనులను పూర్తి చేసి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నాం. రహదారి విస్తరణ పనుల్లో భాగంగానే తర్నం బ్రిడ్జి నిర్మాణ పనులను చేపడుతాం. దీనికి గాను రూ.25కోట్ల నిధులను కేటాయించాం. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల పాటు సమయం పట్టే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు లోలెవల్ వంతెన మీదుగా వాహనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

• పనులకు ఆటంకంగా పైపులైన్

బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మిషన్ భగీరథ పైపులైన్ ఆటంకంగా మారిందంటూ నేషనల్ హైవే ఆథారిటి అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పైపులైన్‌ను తొలగించాలని పలుమార్లు సంబంధిత మిషన్ భగీరథ ఉన్నతాధికారులకు సూచించిన తీవ్ర జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. ఇప్పటికప్పుడు ఈ పైపులైన్‌ను తొలగిస్తే జైనథ్, బేల మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచి పోయే ప్రమాదం ఉందంటున్నారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు పైపులైన్‌ను తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టినట్లు (తరువాయి 6వ పేజీలో..)



కలెక్టర్ రాజర్షిషాతో మాట్లాడుతున్న రైతు వెట్టి ఆనంద్‌రావు

ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి కృషి

• కలెక్టర్ రాజర్షిషా • పలు సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు కృషిచేస్తున్నారని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పైలెట్ ప్రజావాణి, ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో మొత్తంగా వచ్చిన 257 ఫిర్యాదులపై బహిరంగ విచారణ చేపట్టారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మలవియాలతో పాటు ఐటీడీఏ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రజావాణి బహిరంగ విచారణ వేదికపై కిసాన్ మిత్ర అనే స్వచ్ఛంద సంస్థ మారుమూల గ్రామాల్లో ప్రచారం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కానీ అనేక గ్రామాల్లో ఈ ప్రజావాణిపై అవగాహన లేకపోవడంతో చాలామంది ప్రజలు తమ సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలో తెలియడం లేదని చెప్పారు. మండలంలోని సమాక, కేస్లాగూడ, పిట్ట బొంగరానికి చెందిన ఆదివాసులు సోయం బొజ్జు తనకు రుణమాఫీ కాలేదని, పీఎం కిసాన్ పథకం అందలేదని ఫిర్యాదు చేశారు. పిట్ట బొంగరంకు చెందిన వెట్టి ఆనంద్‌రావ్ తాను 157సర్వే నెం.లో ఉన్న 5.0 ఎకరాల భూమిని గత 30 ఏళ్ల నుంచి సాగుచేస్తున్నా ఇంతవరకు తన పేరుపై పట్టా కాలేదని కలెక్టర్‌కు విన్నవించారు. గతంలో పనిచేసిన ఓ వీఆర్వో కుమ్ర హీరామన్ పేరిట పట్టా చేశాడని మొరపెట్టుకున్నాడు. స్పందించిన కలెక్టర్ వారం రోజులలోపు సమస్యను పరిష్కరించాలని మండల రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. లేనియెడల ఐటీడీఏ సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ప్యూట్ కేసును నమోదుచేయాలని ఆదేశించారు. కేస్లాగూడకు చెందిన హెచ్.కే.గంగారాం తనకు గృహజ్యోతి కింద జీరో బిల్లు రావడంలేదని, రుణమాఫీ కాలేదని ఫిర్యాదుచేశారు. అనేకమందికి ఒకే కుటుంబంలో 2లక్షలకు పైన రుణం ఉన్నవారికి రుణమాఫీ కాలేదని అధికారులు సమాధానమిచ్చారు. దాంతోపాటు అనేక మందికి గృహజ్యోతి కింద జీరో బిల్లు రావడం లేదని, గ్యాస్ సబ్సిడీ రావడం లేదని ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ రాథోడ్ రవిందర్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరికొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గప్ ఈశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సిరికొండ మండలంలోని సోన్‌పెల్లి గ్రామఅభివృద్ధికి రూ.25లక్షల నిధులు విడుదల కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావ్, రాజు, బాబు, మధుకర్, జ్యోతిబా, ఆనంద్, న్యానుబా, రమేష్, కామ్‌రాజ్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



నాగేశ్వర్‌రావు బృందంతో మాట్లాడుతున్న ఆత్రంసుగుణ

'కవ్వాల్ టైగర్‌జోన్‌లో నివసిస్తున్న ఆదివాసీల సమస్యను పరిష్కరిస్తాం'

ఉట్నూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ ల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి గిరిజన గుడాల్లో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఏర్పాటుచేసే అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయటం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణక్క తెలిపారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఓరుగల్లు వన్యప్రాణుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలోని సభ్యుల బృందం సుగుణక్కను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల స్థితిగతులపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. గిరిజనుల అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టిపెట్టారని, వారి బాధలు తీర్చటానికి తాను కృషి చేస్తాననన్నారు.

ఎమ్మెల్సీ బరిలో డీటీయూ అభ్యర్థి

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ధర్మా టీచర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ తరపున టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కృష్ణపెల్లి రాజేషుడు బరిలో ఉన్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ ఎస్టీ అగ్రకుల కులాల గొంతుకగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాజేషుడును బరిలో ఉంచామన్నారు. కార్యక్రమంలో ధర్మా టీచర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎల్మాల నగేష్, బొర్రా నగేష్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సహకార బ్యాంకు నిర్మాణ పనులు

బోథ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో నూతనంగా సహకార బ్యాంకు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు గురువారం సీఈఓ గోలి స్వామితోపాటు సహకార సంఘం డైరెక్టర్లు ఎల్ పోశెట్టి జి రాజు యాదవ్ నిర్మాణం స్థలాన్ని పరిశీలించారు. సహకార బ్యాంకు ముందున్న దుకాణాలను తొలగించనున్నట్లు చెప్పారు. వారివెంట సహకార బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌తోపాటు స్థానిక బ్యాంకు మేనేజర్ పోశెట్టి సిబ్బంది పాపన్న తదితరులు పాల్గొన్నారు.



కొలతలు తీస్తున్న సిబ్బంది పాల్గొన్న అధికారులు

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దగ్ధం

బోథ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెడ్డిలను అవమానించేలా మాట్లాడిన తీన్మార్ మల్లన్న నోరు అదుపులో పెట్టుకోవాలని, నోటిచ్చినటన్లు మాట్లాడితే రెడ్డిలు తగిన బుద్ధి చెబుతారని రెడ్డి సంఘం సభ్యులు హెచ్చరించారు. గురువారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న రెడ్డిలను కించపరిచేలా మాట్లాడడం సరైనది కాదని, తన నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. తీరు మార్చుకోని పక్షంలో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాని కూడలి వద్ద ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.



మల్లన్న దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

పీడీఎస్‌యూ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శిగా అశోక్

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈనెల 4, 5వ తేదీల్లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్య (పీడీఎస్‌యూ) జనరల్ కౌన్సిలింగ్‌లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కుమ్ర అశోక్‌కు రాష్ట్ర కమిటీ సహ ప్రధాన కార్యదర్శి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ మాట్లాడుతూ తనను రాష్ట్ర కమిటీలో తీసుకోవడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.

టీచర్ల సమస్యలు తెలిసిన అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించాలి: టీపీటీఎఫ్

ఉట్నూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధి చెందాలంటే విద్యారంగానికి చెందిన వారిని, టీచర్ల సమస్యలు తెలిసిన వారిని గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వ్యక్తులను, ధనస్వామిక వ్యక్తులను ఓడించి, ఎల్లప్పుడు విద్య కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే అశోక్ కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1987 నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై చురుకైన పాత్ర పోషిస్తూ ఉద్యమాలు నడిపించిన అశోక్‌కుమార్‌ను కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, యూటీఎఫ్ నాయకులు కుంరశ్రీనివాస్, టీపీటీఎఫ్ కుంరంభీమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారు

• డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య



స్వీట్లు తినిపించుకుంటున్న మహిళలు

ఉట్నూర్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మాదిగలందరూ ఎస్సీ వర్గీకరణకు పూనుకున్న కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య అన్నారు. గురువవారం ఉ ట్నూర్ మండలంలోని దంతనప ల్లిలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సంబరాలను డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామపెద్దలు మాదగకుల పెద్దలతో కలసి డప్పులతో ర్యాలీగా వచ్చి అం బేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగిరి ప్రీతంల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ మాదిగల మూడుదశాబ్దాల కల కాంగ్రెస్‌తో సాధ్య మైందని అన్నారు. మహిళలు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిరుదుల లాజర్, సామాజిక కార్యకర్త అరకిల్ల అశోక్, యువజన కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్‌రావ్, భాస్కర్, దంతన్‌పల్లి, గ్రామస్థులు కంపెల్లి రాజుకుమార్, నాతరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ఆందోళన వద్దు

• పూర్తి అవగాహనతో ఉంటే వ్యాధులను అరికట్టవచ్చు: డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన

తలమడుగు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల అంటూ వ్యాధుల పట్ల ఆందోళన చెందవద్దని, పూర్తి అవగాహనతో ఉంటే వ్యాధులను అరికట్టవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, మనోహర్ అన్నారు. వందరోజుల టీబీ ప్రచారంలో భాగంగా గురువారం తలమడుగు మండలంలోని కజ్జర్లలో తలమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 60ఏళ్ల పైబడిన వారికి తేమడ పరీక్షలు నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సాధన హాజరై అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సాధన మాట్లాడుతూ టీబీ లక్షణాలను విద్యార్థులకు వివరించారు. తమ తమ చుట్టుపక్కల ఇళ్లల్లో ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని ఎవరైనా గుర్తిస్తే స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు ఆశాలకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఐరన్ పోలిక్ యాసిడ్ సప్లిమెంట్లను అందజేయడం జరుగుతుందని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ హరీష్, వైద్య సిబ్బంది చిన్నయ్య, యశోద, విజయ, అనిల్, ఉపాధ్యాయులు కౌడాల రవీందర్, తదితరులు ఉన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో



నాగోబా జాతర ఆలయ హుండీ లెక్కింపు దృశ్యం

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

• జాతర ఆదాయం రూ.21,08,511

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర హుండీ లెక్కింపును గురువారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయ ప్రాంగణంలో మెస్రం వంశీయులు, ఆలయ కమిటీ, రెవెన్యూ, దేవాదాయ, ఐటీడీఏ, పోలీస్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో నాగోబా ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.21లక్షల 8వేల 511 వచ్చిందని దేవాదాయశాఖ ఈవో రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్, దేవాదాయశాఖ సీఎఫ్‌వో రవికుమార్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

సోనాల మండలం ఏర్పాటు పట్ల ఆదివాసీల హర్షం

బోథ్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా సోనాల మండలం ఏర్పాటు కావడంతో మండలం చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు. మండల ఏర్పాటుతో తమకు దూరం తగ్గడంతోపాటు సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని గిరిజనులు పేర్కొన్నారు. అయితే ఆదివాసుల సమస్యల పరిష్కారానికి అధికారులు సకాలంలో స్పందించాలని వారు కోరారు.